# ఇది ప్రజల కథ

రచన :
శ్రీ టి. ఎస్. ఆనంద్

పూర్వం అవంతీపుర రాజ్యాన్ని ఆనందభూపాలుడనే రాజు, పరిపాలిస్తున్న రోజులవి. ఆతని పరిపాలనలో ప్రజలు, ఏ విషయంలోనూ ఎట్టి బాధలకు లోనుకాకుండా, సుఖశాంతులతో గడపాలన్న ఆశయంతో, అనేక రకములయిన పద్ధతులను ప్రవేశ పెట్టాడు బీద-ధనిక ప్రజలకు సమాన న్యాయం చేకూర్చాలని, కూడూ-గూడూ-గుడ్డ ప్రతి వారికి అందుబాటులో వుండాలని-ప్రణాళికలు అమలు చేశాడు. వయసు మళ్ళిన వారికి సహాయం తను అందించగలనని, భర్తలేని స్త్రీలకు నెలకు కొంత పైకం అప్పగిస్తామని హామీలిస్తూ అమలు చేశాడు కూడా. ఆనందభూపతి పరిపాలనను - ప్రజలపైనున్న మమకారాన్ని అర్థం చేసుకొన్న ప్రజలు - ఎన్నటికైనా, అలాంటి రాజే కావాలని కోరుకునేవారు.

ఇదిలా వుండగా - ఆ రాజ్యంలో వేడుకలు జరుగుతున్న రోజులొచ్చాయి. నృత్య-గానములతో, వివిధ రకాల కళాకారుల సమన్వయంతో, ఆటలతో, వింత-వింత వేష ధారణలతో సుఖ సంతోషంగా ఆ వేడుకలు ముగిశాయి. వేడుకలనంతరం, సభా ప్రాంగణంలో రాజు, ప్రజల నుద్దేశించి- 'నా ప్రియమైన సోదరులారా! నా యింటి ఆడపడుచులారా! చిరునవ్వు చిందించు, నా తమ్ముళ్లారా! అని సంబోధించి - మీరు, నాపై చూపిన అపార గౌరవానికి, ఎల్లవేళలా, మీ సేవ చేయడానికి సంసిద్ధుడనై ఉన్నాను. మీ శుభా శీస్సులతో, నన్నింకా ముందుకు నడిపించాలి. ఇంతవరకు, అనేక పణాళికలు అమలు చేశాం. ప్రజలు ఆదరించి ఆశీర్వదించారు. ఆకలి బాధ తీర్చడానికై, కావల్సిన ఆహార ధాన్యాన్ని అందుబాటులో వున్నట్టు చేశాను. శరీరం కప్పుకోడానికి, వస్త్రాలపై పన్ను లేకుండా, గిట్టుబాటు ధర చేయించాను. ఇల్లులేని బడుగు వర్గాలకి గృహ నిర్మాణ పథకాలు ప్రవేశపెట్టాను. ఇలా ఎన్నెన్ని చేశానో మీ అందరికీ తెల్సిందే. ఇంకా చేయాలి. నా చివరి రక్తపు బొట్టు వున్నవరకూ నేను మీ వాడ్ని!..' అన్నాడు ఆనంద భూపాలుడు ముకుళిత హస్తాలతో ప్రజల నుద్దేశించి.

ప్రజల్లో కోలాహలం బయల్దేరింది. చప్పట్లు మార్మోగాయి. 'ఆగండి....' అంటూ ఓ యువకుడు ముందుకు దూసుకు వచ్చాడు. ప్రజలు ఒకరి మొఖాలు ఒకరు చూచుకున్నారు. రాజు, ఏమన్నట్లు మంత్రి జంబూకం వైపు చూశాడు. అర్థం కానట్లు తలూపాడు జంబూకం మంత్రి.

'ఎవరు బాబూ నీవు? ఎందుకలా అరిచావ్?' సావధానంగా అడిగాడు రాజు, ఆ యువకుడ్ని వుద్దేశించి.

'మన్నించండి, మహారాజా! నేను ఈ అవంతీపుర రాజ్యంలో ఒక పౌరుడ్ని. వేదశాస్త్రాలు బాగా చదివినవాడ్ని. కత్తి-కర్ర సాములలో కాక, గుఱ్ఱపుస్వారీ నాకు వెన్నతో పెట్టిన విద్య. నాకు 'నా' అనేవారు ఎవ్వరూ లేకపోయినా, నాకున్నది ఒక్కటే ఆత్మస్థైర్యం. మీ రాజ్యంలో మీరు అమలు చేసిన పథకాలు. అందుకునే వారెందరు? ఈ చప్పట్లు కొట్టిన చేతులు స్వార్థపరులవా? స్వార్థ రహితులవా? తెల్పండి.

పథకాలు పకడ్బందీగా జరిగాయని, ప్రజలందరికీ అవకాశాలన్నీ అందుతున్నాయని అనుకోడం మీలాంటి రాజుకి తగిన పని కాదు. దళారీల విధానం యింకా మాసిపోలేదు, మహారాజా! తమతమ స్వార్థాల కోసం, అధికార పూర్వక గర్వాల కోసం, సగటు మనిషిని సమాధి చేసే, నయవంచకులు ఈ సంఘాన్ని, ఈ దేశాన్ని ఏలుతున్నంత కాలం, సామాన్య మనిషికి మిగిలేది బ్రతికుండగా సమాధులే, మహారాజా!' ఆవేశంగా వూగిపోతున్నాడు ఆ యువకుడు.

'ఆఁ....వితండ వాదిని, వాచాలుని బంధించి, చెరసాలలో వేసి, చిత్రవధ చేయించండి, మహారాజా!....' అన్నాడు మంత్రి.

చిరునవ్వు నవ్వాడు ఆనందుడు. 'చూడు, బాబూ! నీలో ఎంత యదార్థముందో, ఎంత నిజా నిజాలు అణగారిపోయాయో తెలుసుకుంటాం. అంతవరకూ నీవు మా అధీనంలోనే వుండాలి. ఇతన్ని తీసుకువెళ్ళి మన రహస్య మందిరంలో వుంచండి!....' ఆజ్ఞ జారీ చేశాడు ఆనంద భూపాలుడు.

* * *

ఆ వెన్నెల రాత్రిలో అటూ-ఇటూ పచార్లు చేసి, అంతు చిక్కని ఆలోచనలతో, ఆ ఉద్యానవనం పాలరాతి ఆసనంపై ఆశీనుడయ్యాడు ఆనందభూపతి. ఉదయం జరిగిన కథను నెమరు వేసుకొని, మహారాజు ఆలోచనకు సరైన మార్గం చూపాలన్న ధ్యేయంతో, రాణి సుగుణమతి అతని ఆలోచనకు అంతరాయం కలిగించి, 'ప్రభూ!' అంది.

'మహారాణీ! తమరిలా వచ్చుటకు కారణం? జరిగిన కథ, మీ మనోవ్యధ నాకు తెలుసు. దానికి ఒకటే ఉపాయం.'

'ఏమిటది?'

మహారాజు చెవిలో రహస్యం చెప్పింది రాణి.

'అందుకే అన్నారు, మహారాణీ!'

'ఏమని ?'

'కరణేషు మంత్రీ!' అని, ఆనందంగా రాణి మొహం లోకి చూచాడు.

సిగ్గుతో, చిరునవ్వుతో తల దించుకుంది.

* * *

నమ్మకస్తుడైన ఆంతరంగికుడు అరవిందం భిక్షగాడిలా, పొట్ట కూటి కోసం చాలా దూరం నడచి వస్తున్న బాటసారిలా మహారాజు, మారువేషాలు ధరించారు. ధర్మసత్రం వద్ద గుసగుసలు వినపడ్డాయి. వెళ్ళేవారు, ఆ సంభాషణలు వస్తున్నవైపు ఆగి చాటుగా వింటున్నారు.

'ఒరేయ్! రాజుగారు మల్లాంటోళ్ళకి తల దాచుకోడానికి సీఠ విత్తామన్నారు. ఇచ్చేమంటున్నారు. మరీ సత్రవ్ బతుకేట్రా? ఎదుటున్నవాడ్ని ప్రశ్నించాడు.

'ఒరీ, పిచ్చిసన్నాసీ! ఈ కాలంలో ఏదీ రావాలన్న ఉన్నోళ్ళకే వత్తాది అన్నీ ఉన్నోళ్ళకే అమర్తాది.'

'అంటే ... ?'

'అంటేటి? వన కొత్వాలు గాడున్నాడు. ఆడెనక ఏటుంది....డబ్బుంది. మరి, పదవి వుంది. ఏది సెప్తే రాజు గారది సేసేత్తున్నారన్న ధీమా వుంది. అందుకని, ఆ కొత్వాలుగోడు ఏటిసేసాడో తెల్సా?'

'ఏటి సేసాడు?'


నేడే కొనండి!

బాలసుబ్రమణ్య

BMF

IS-325



* మోటారులు,

* మోనో బ్లాకులు

* పంపుసెట్లను.

ఎందుకనగా—

అవి తక్కువ విద్యుచ్ఛక్తికీ,

దీర్ఘకాల మన్నికకూ,

గట్టితనానికీ

ప్రసిద్ధి చెందినది.

వివరములకు:

Grams: RUNWELL Phone: 24313

ఆర్. సంబంధం B.A.B.L.

రిసీవర్.

బాలసుబ్రమణ్య ఫౌండ్రి

433, పటేల్‌రోడ్డు : : కొయంబత్తూరు-641 009

'ఏటి సేసాడని నెమ్మదిగా అంటావేట్రా. ఎర్రి సన్నాసి! రోజుకి వది వరహాలొచ్చే వ్యాపారమున్నోళ్ళకి - భూమి-పుట్రా, నగా-నట్రా ఉన్నోళ్ళకి ఇల్లు యిప్పించాడు. పాపం, ఆళ్ళంత పేదోళ్లు అనుకొని ఆ మారాజు నమ్మాడు. ఇచ్చేశాడు. అంతే....ఈ ఇసయం రాజుగారికి సెప్పే దమ్ము ఎవడికుంది? సెప్పిన, రాజు దగ్గరకెళ్ళే లోపల, ఎన్ని-ఎన్ని అడ్డుదార్లు మరదాకీలకంరా కొండే!... అన్నాడు.

అరవిందం, ఆనందభూపతి ఒకరి మొఖాలొకరు చూసుకుంటూ మరి కొంత దూరం బయలుదేరారు.

అప్పటి యింట్లో ఓ విధవ స్త్రీ రోదిస్తుంది. ఆ పక్కన ఓ పండు ముసల్ది. ఎదురుగా శవమైన యుక్తవయస్కుడు. ఆదుర్దాగా అక్కడికి వెళ్ళారు. ఏం జరిగిందని సల్లూరితో పాటు రాజు, అరవిందం విచారించారు.

చివరకు తేలిందేమిటంటే, ఆ యుక్తవయస్కుడయిన శవాకారంగా మిగిలిన వ్యక్తి సర్వశాస్త్రాలు చదివిన కవి. తెలివైన వాడు. అతనికి మిగిలింది భర్తను కోల్పోయిన తల్లి. తన తల్లినికన్న అమ్మమ్మ, పేదరికం ఇవే మిగిలాయి. రాజుగారు ముసలివాళ్ళకు సాయం చేస్తానన్న సాయం వీళ్ళకి రాలేదు. కారణం గ్రామాధికారులుగాను పెద్ద మొత్తాలు అందలేదు. విధవరాళ్ళకు చేస్తున్న సాయంలో పేదరాలయిన ఆ విధవరాళ్ళకు అందలేదు. కారణం లంచం. బహుమాన రూపంగానో, నగల రూపంగానో అందుకుంటున్న దళారులవలన, అసలైన పేదవాళ్ళకి ఈ పథకాలు చేరలేదు ఉద్యోగం లేక, ఆకలి మంటలు చూడలేక, కన్నవారి ఆశలు అణగారి పోవడం యిష్టం లేక, తవిలా జీవచ్ఛవంలా బ్రతకలేక - లంచాల వలయాల నుండి, అవినీతి-అద్దువారుల నుండి ఈ విధంగా తప్పించుకొన్నాడు ఆ అభాగ్యుడు. అసలీ రాజ్యంలో పేదవాడికి ఓ న్యాయం. ఉన్నవాడికి ఓ న్యాయం అనే భేదాలు లేవని ఊకదంపుడు మాటలు పలికే ఆ రాజు చెవులు చిల్లులు పడ్డాయా? కళ్ళు మూతలు పడ్డాయా? నోరు నొక్కుపోయిందా? రక్తం యింకిపోయిందా? ఏం జరుగుతుందో ఆలోచించే మేధస్సు మొద్దుబారి పోయిందా? ప్రశ్నలపై ప్రశ్నలు వేసుకొన్నారు అక్కడున్న జనం. అక్కడ్నుంచీ ఇద్దరూ నెమ్మదిగా తప్పించుకొన్నారు. రాజు తల వంచుకొని ఆలోచిస్తూ నడుస్తున్నారు. అంతరంగికుడు అనుసరిస్తున్నాడు. చటుక్కున ఓ దగ్గర ఆగిపోయారు. చంటి పిల్లలు గుక్క త్రిప్పుకోకుండా ఏడుస్తున్నారు. ఒక కుక్క-మంచంపై బక్క-చిక్కిన ఓ ముసలాడు దగ్గుతూ ఆయాసంతో రొప్పుతున్నాడు. పాలివ్వలేని నిస్సహాయత స్థితిలో తల్లి - ఎదిగిన పిల్లలు 'ఆకలి....ఆకలి' అంటూ ఆర్తనాదం-ఆ బాధ భరించలేక, ఆకలంటున్న ఆ పిల్లల్ని నిర్దాక్షిణ్యంగా తన బాధ చెప్పుకోలేక, ఆ పిల్లల్ని కొడుతుంది. ఈ దృశ్యాన్ని చూచి రాజు గుండె కరిగింది. అమ్మా! పిల్లలకు తిండి పెట్టుకోలేక ఇలా చేయడం మంచిది కాదు. పైగా రాజు - అందుబాటులో ఆహార ధాన్యాలు, న్యాయమైన ధరకు యిస్తున్నట్లు విన్నానే!

ఆఁ-ఆఁ....రాజా....పాడా! అతగాడు గద్దీ ఎక్కి-అన్నీ చేసేస్తున్నానని గర్వంగా చెప్పుకోడమే గాని, అవి అందావని ఆలోచించాడా? ఆహార దినుసులు అమ్మే ఆ సుబ్బిశెట్టి, ఆ పోలిశెట్టి - కొత్వాలుకి, కోశాధిగారికి ఆ రాజు సిబ్బంది మామూలు, లంచాలు పొంది, అదిని పెరటిత్రోవన అమ్మినా పరవాలేదనిపించారు. అందుకే బస్తాలకొలదీ ధాన్యం రెట్టింపు రేట్లతో అమ్ముతున్నారు. ఇక మాలాంటోళ్ళు ఎవరితో సెప్పుకోవాలి, బాబూ!' ఆవేదనగా, ఆవేశంగా అంది.

ఫోన్ నెం: 21386



Saradha
—KNITTING MILLS—
TIRUPUR-638604.

'నిజమే ! కంచే చేను మేసినా, రాజు కళ్ళు మూసుకున్నా నిష్ప్రయోజనం!' నిట్టూర్చి అక్కడ్నుంచి కదిలారు ఆనందభూపాలుడు, అరవిందుడు.

* * *

ఆ రోజు —

ఆనందభూపాలుని సభ కిటకిట లాడుతుంది. తలవని తలంపుగా పెట్టిన ఈ సమావేశపు నిర్ణయం ఎలా ఉంటుందో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

సింహాసనంపై నుండి రాజు లేచాడు. ప్రజలారా! ఇంతవరకు నేను చేసిన చట్టాలు, నేను చేసిన మంచి పనులు, బడుగువర్గ ప్రజలకు అందాయని, సర్వమానవత్వం ప్రజల్లో వచ్చిందని నమ్మి, నిజంగా వెర్రిపాప నయ్యాను.

నాటి వేడుకల్లో నా కళ్ళు తెరిపించాడు ఓ పౌరుడు. ఆంతరంగికుల్లో అత్యాచారాలు, నమ్మకస్తులలో నమ్మిక ద్రోహం ఉందని స్వల్పకాలంలోనే తెలుసుకొన్నాను. దళారీలు, మధ్యవర్తులు, మేము చేసే పథకాలు చేజిక్కించుకొని వారివారి స్వార్థాల కోసం, బంధుప్రీతితో, కుల ప్రీతితో, అధికార దాహంతో, పదవీ వ్యామోహంతో, తమతమ కీర్తిప్రతిష్ఠల కోసం, అన్నీ ఉన్నవారికే, అన్నీ అమర్చి కాలే కడుపుల్లో కార్చిచ్చు రగిలిస్తున్నారని మేము స్వయాన తెలుసుకొన్నాము. మీకేం భయం లేదు. మిమ్మల్ని భయపెట్టి, వంచించి, మీ దగ్గర డబ్బు గుంజి, మీలోని నిస్సహాయతను ఆసరాగా తీసుకొని, ఉన్నవాళ్ళని అందలమెక్కించి లేనివాళ్ళని అన్యాయం చేస్తున్న ఆనందరూప రాక్షసులెవరో మీ నోటితో చెప్పండి. భయం లేదు. నేనున్నాను చెప్పండి ?' అన్నాడు ఆనందభూపాలుడు.

ప్రజలు ఒకరి మొఖాలొకరు చూసుకొన్నారు. కొంతమంది ముక్తకంఠంతో, 'ప్రభూ ! ఇంతకాలం యివన్నీ మీరే చేయిస్తూ నాటకమాడుతున్నారని ఆపోహ పడ్డాం. క్షమించండి ! ఈ రాజ్యానికి చీడపురుగులు అదిగో జంబూక మంత్రి, కొత్వాలు, సైన్యాధికారి, గ్రామాధికారులు ప్రభూ !' అన్నారు.

'మీరన్నది అక్షరాల నిజం. మీ న్యాయసమ్మతమైన వాక్కును శిరసా వహిస్తాను. పథకాలు పకడ్బందీగా జరిగావని ప్రభువు అనుకోవడం పొరపాటు. అవి ఎందరికి అందుబాటులో వున్నాయని ఆరా తీయాలి. ప్రభువుగా తన వంతు కర్తవ్యం గుర్తించి, నిజా నిజాలు తెలుసుకోవాలి. అందుకు, మీ అందరి సహకారం ఎప్పటికప్పుడు నాకు కావాలి. మాకు లోపాలు తెలియచేయాలి. ఈ చీడపురుగులకు ఈనాడే మరణదండన విధిస్తూ శాశ్వత కళంకాన్ని కడిగి వేస్తున్నాను."

ప్రజల్లో ఆనందోత్సాలు విలయతాండవం చేశాయి.

రహస్య మందిరంలో ఉన్న పౌరుల్ని శ్లాఘిస్తూ ఆతనికి తన కొలువులో ఉద్యోగమిస్తూ, తనకు సలహాదారునిగా నియమించాడు రాజు.

నాటినుండి అవంతీపుర రాజ్యంలో అవినీతి మార్గాన నడవడానికి, దళారీలు, అధికారులు భయపడుతూనే ఉన్నారు.





విూ....

నమ్మకకు పాత్రమైన

బనియన్ల రకాలు

☆

* అనిల్ ఫైన్ * అనిల్ కూల్ టెక్స్

* అరినో (కలర్) * బ్రీఫ్స్ & ట్రంక్స్

—— తయారించువారు: ——

Phone : 22411

ANIL HOSIERY

"SIDCO" Industrial Estate:

TIRUPUR - 638 602.